క్లుప్తంగా

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రోడ్డు మార్జిన్, డ్రెయిన్‌లపై ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 30, 31 డివిజన్‌ల పరిధిలోని శారదానగర్ శివ గంగ ప్రాంతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మంగళవారం తొలగించారు. మురుగు కాలువ సెంటర్ నుంచి శారదానగర్ వైపు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయిన్, రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించారు. కమిషనర్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరిప్రసాద్ పర్యవేక్షణలో ఆక్రమణలను తొలగించారు.

నగదు లెక్కింపు మిషన్ వితరణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానానికి మోపిదేవికి చెందిన కారుమూరి గోపీరాజు, హరికృష్ణవేణి దంపతులు క్యాష్ కౌంటింగ్ మిషన్‌ను మంగళవారం అందజేశారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన వారు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు ఈ కౌంటింగ్ మిషన్ అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. రాంబాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



చల్లపల్లి: మండల పరిధిలోని వక్కలగడ్డ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మద్దుల గీతార్థ్ జవహర్ నవోదయా విద్యాలయ రెసిడెన్సియల్ స్కూలుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బొందలపాటి వెంకట వీర నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. మద్దుల నరసింహారావు కుమారుడు గీతార్థ్ 2025- 26వ సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యాడు. గీతార్థ్ నవోదయకు ఎంపిక కావటం పట్ల ఎంఈవో-2 పి.వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. శిక్షణ ఇచ్చిన నాగమల్లేశ్వరరావును అభినందించారు.

బోరు పంపు ఏర్పాటు



గూడూరు: క్రైస్ట్ ఫెలోషిప్ మినిస్ట్రీస్, కోనప్పపేట ఆధ్వర్యంలో కంకటావలోని మండల పరిషత్ పాఠశాల నీటి సమస్యకు పరిష్కారం లభించింది. సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో బోరు పంపు వేయించారు. గ్రామ సర్పంచి మద్దాల మోహనరావుతో కలిసి సంస్థ ప్రతినిధులు బోరు పంపును ప్రారంభించారు. కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులు డాక్టర్ ఎం.జోసఫ్, ఉపసర్పంచి బూరగడ్డ బాబీ, పాఠశాల హెచ్‌ఎం జి.నవీన్ బాబు, ఎస్‌ఎంసి ఛైర్మన్ గల్లా దుర్గారాణి పాల్గొన్నారు.

పుల్లపాడు సర్పంచి నాగేశ్వరమ్మ మృతి



పెడన: మండలంలోని పుల్లపాడు గ్రామ సర్పంచి జోగి నాగేశ్వరమ్మ (75) మంగళవారం సాయంత్రం గుండె పోటుతో మృతి చెందారు. ఈమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. కుమారుడు జోగి సుబ్రమణ్యం, కోడలు జోగి అనితలు గతంలో గ్రామానికి సర్పంచులుగా చేశారు. నాగేశ్వరమ్మ మృతి పట్ల వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము), వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి వెంకటరామానాయుడు, రాజులపాటి అచ్చుతరావు, దావు బైరవలింగం, కొండవీటి నాగబాబులతో పాటు ఎంపీడీవో కార్యాలయం వారు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

మొవ్వ: విద్యార్థులంతా తప్పనిసరిగా భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని కూచిపూడి ఎస్‌ఐ కె.నాగవిశ్వనాథ్ సూచించారు. మొవ్వలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, హిస్టరీ, ఎకనామిక్స్, ఐక్యూఏసీ విభాగాలు సంయుక్తంగా రెండునెలలుగా భారత రాజ్యాంగంపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ మంగళవారంతో ముగిసింది. ఎస్‌ఐ నాగవిశ్వనాథ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి, వైస్ ప్రిన్సిపాల్ కేర్ మంజుల, సర్టిఫికెట్ కోర్స్ కన్వీనర్ డాక్టర్ ఎం.సుందరరావు, అధ్యాపకులు కెప్టెన్ ఆర్. వెంకయ్య, జి.సురేష్‌బాబు, ఎల్.వి.కృష్ణారావు, ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గృహాల మధ్య వైన్ షాపునకు అనుమతిపై ఆగ్రహం

ఎక్సైజ్ సిబ్బందిని ప్రశ్నించిన ఎంపీపీ



ఎక్సైజ్ సిబ్బందిని నిలదీస్తున్న ఎంపీపీ కోట విజయరాధిక

చల్లపల్లి: నివాస గృహాల వద్ద మద్యం షాపు ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇచ్చారని ఎంపీపీ కోట విజయరాధిక ఎక్సైజ్ శాఖ సిబ్బందిని నిలదీశారు. పట్టపగలు ఆరోడ్డులో వెళ్లాలంటేనే భయానక వాతావరణం ఉంటుందని, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. సమావేశంలో మొవ్వ ఎక్సైజ్ శాఖ హెడ్‌కానిస్టేబుల్ జి.వి.సుబ్బారావు మాట్లాడుతుండగా ఎంపీపీ కల్పించుకుని చల్లపల్లి బైపాస్ రోడ్డులోని సాగర్ టాకీస్ వద్ద కుటుంబాలు నివసించే ప్రాంతంలో షాపు ఏర్పాటుకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. దీనికి సుబ్బారావు సమాధానమిస్తూ తహసీల్దార్ అంగీకరించిన మీదటే తాము పర్మిషన్ ఇచ్చామన్నారు. తహసీల్దార్ అయినా నిబంధనలు పక్కనపెట్టి ఎలా అనుమతి ఇస్తారని విజయరాధిక ప్రశ్నించారు. అది తహసీల్దార్‌కే తెలియాలని కానిస్టేబుల్ సుబ్బారావు అన్నారు. మంగళాపురం గ్రామ సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు కల్పించుకుని తమ గ్రామంలో బెల్టు షాపు ద్వారా విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో తొలుత స్థానిక రాజీవ్ గాంధీ కాంప్లెక్సుభవనం మరమ్మతులు చేసేందుకు తీర్మానం చేసినట్లు ఎంపీపీ తెలిపారు. కాంప్లెక్సులో వ్యాపారాలకు కొంత సమయం ఇచ్చి మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, లక్ష్మీపురం- 2 ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్ కోరారు. మంగళాపురం గ్రామ సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో చెరువు గట్టు ఆక్రమణలకు గురైనా తహసీల్దార్ స్పందించటంలేదని ఆరోపించారు. టీడీ శ్రీలత మాట్లాడుతూ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. సచివాలయ నిర్మాణాలు పూర్తయినా పంచాయతీ సర్పంచ్‌లు స్వాధీనం చేసుకోవటంలేదని పంచాయతీరాజ్ ఏఈ అన్నారు.

అధికారుల గైర్హాజరుపై..

సర్వసభ్య సమావేశం గురించి మూడు రోజులు ముందుగానే సమాచారం ఇచ్చినా కొందరు అధికారులు గైర్హాజరవడంపై ఎంపీపీ విజయరాధిక, ఎంపీడీవో ఎ.వి.రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్ముందు ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈవో- 2 పి.వెంకటేశ్వరరావు, సాయిసింధు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈ- శ్రమ కార్డుల నమోదు



ఈ- శ్రమ కార్డులు నమోదు చేస్తున్న సిబ్బంది

నాగాయలంక: స్థానిక కిరాణ మర్చంట్స్ అసోసియోషన్ అధ్యక్షుడు చిట్టా వీర అన్నపూర్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం నాగాయలంక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో అసంఘటిత కార్మికుల అవగాహన, ఈ- శ్రమ కార్డుల నమోదు కార్యక్రమం జరిగింది. అవనిగడ్డ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గాజుల విజయసారథి నేతృత్వంలో వివిధ రంగాల్లోని అసంఘటిత కార్మికులను కిరాణా మర్చంట్స్ ద్వారా సమీకరించి అర్హులైన వారందరికి ఈ- శ్రమ కార్డులు నమోదు, మంజూరు చేపట్టారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ విజయసారథి మాట్లాడుతూ నెలకు రూ.15 వేల లోపు ఆదాయం ఉన్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల విలువైన ప్రమాద బీమా కార్డు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. అసంఘటిత కార్మికులందరూ వీటికి అర్హులేనన్నారు. భారత ప్రభుత్వం రూపొందించిన ఈ శ్రమ యాప్ ద్వారా 150 మంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, జల్లూరి ప్రకాశ్, చిట్టా వెంకట శేఖర్, కార్మికశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 21 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని ప్రిన్సిపాల్ ఎస్‌జీకే ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఫాక్స్ కాన్ ఇంటర్‌కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఆవిష్కార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలచే నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఫాక్స్ కాన్ ఇంటర్ కనెక్ట్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీకి ఐదుగురు, ఆవిష్కార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, సెక్రటరీ తాడేపల్లి మెహర్ బాబా, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, డైరెక్టర్లు దోనపాటి బాబా, తమ్మిన సాయి, అధ్యాపకులు, సిబ్బంది తనతో పాటు అభినందించారన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఎంతో పవిత్రంగా ఉపవాసదీక్షలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పెద్ద మసీదు (జామీయా)లో ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్‌ఖయ్యూం, టీడీపీ నాయకులు, మసీదు కమిటీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

చెత్త రిక్షాలు అందజేత

గూడూరు: హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మండలంలోని కప్పలదొడ్డి, ఆకులమన్నాడు, పోలవరం పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలు సమకూర్చారు. పోలవరంలో జరిగిన కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచులకు రిక్షాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఇండస్ట్రియల్ జీఎం ఆర్.వెంకట్రావు, హ్యాండ్లూమ్ డీఓ రాజు, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఆకులమన్నాడు సర్పంచి రఫీ, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, అన్నం హరిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని కలంకారీ క్లస్టర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కలంకారీ కార్మికులకు సేఫ్టీ షూస్, ఎప్రాన్, హ్యాండ్ బ్లాక్ టేబుల్, లాంగ్ టేబుల్, ఫ్యాబ్రిక్‌లను ఎమ్మెల్యే అందజేశారు.

వదిలేస్తే ఇలా.. ప్రాణాలు పోతే ఎలా

- రోడ్డు పాలవుతున్న పశువుల ప్రాణాలు
- వేసవి సీజన్‌లో ప్రమాదాలు నిత్యకృత్యం



జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు



ప్రమాదంలో మరణించిన పశువు (ఫైల్)

కృత్తివెన్ను: వేసవికాలం వచ్చిందంటే జాతీయ రహదారిపై పశువుల ప్రాణాలు హరీ అంటున్నాయి. పంటలు లేకపోవడం పొలాలన్నీ ఖాళీగా ఉండటంతో పాడిరైతులు తమ పశువులను మేతకోసం వదిలేస్తున్నారు. అవి నీటికోసం వెదుకుతూ జాతీయ రహదారిపైకి వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలో నిత్యం రహదారిపై ఏదో ఒకచోట పశువులు ప్రమాదాలకు గురవుతూనే ఉంటున్నాయి. దీని వల్ల లక్షలు విలువ చేసే పశువులు మృత్యువాత పడుతున్నాయి.

ఏడాదిలో 220 పశువులకు పైగా..

పెడన నియోజకవర్గ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలను కలుపుతూ 216 జాతీయ రహదారి సుమారు 40 కిలోమీటర్లు పైబడి విస్తరించి ఉంది. ఈ రోడ్డుపై వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించడం, అనుకోకుండా పశువులు రోడ్డుపైకి రావడంతో ఈ ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. గడిచిన ఏడాది కాలంలో దాదాపు 220 పైబడి వేలాది రూపాయల విలువ చేసే పశువులు ప్రమాదాల బారిన పడి చనిపోయాయి.

వాహనదారులకూ ఇబ్బందులే..

హైవేపై పొరపాటున గేదె, ఆవును ఏదైనా కారు ఢీకొడితే పెనుప్రమాదమే జరుగుతుంది. ఈ ఘటనల్లో పశువు చనిపోవడమే కాకుండా వాహనం పూర్తిగా ధ్వంసం కావడం, ఒక్కోసారి వాహనంలోని వ్యక్తులు సైతం మరణిస్తారు. రెండు రోజుల కిందట మూడు గేదెలు రోడ్డుకు అడ్డుగా రావడంతో అద్దపర్ర సమీపంలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు ప్రాణాలు కోల్పోయాయి.

రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

పాడిరైతులు తమ పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందేనని లేకపోతే ఇటువంటి ప్రమాదాల నుంచి పశువులను కాపాడటం అసాధ్యమంటున్నారు పోలీసులు. దీనిపై రైతులకు గ్రామాలలో అవగాహన కల్పిస్తామని, జాతీయ రహదారి సమీపంలో ఉండే గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పశువులు రోడ్లపైకి రాకుండా నిరోధించేలా రైతులకు వివరిస్తామని ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు.

రేషన్‌కార్డుల ఈకేవైసీ పూర్తిచేయాలి

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రేషన్‌కార్డుల ఈకేవైసీ కార్యక్రమాన్ని డీలర్లు వెంటనే పూర్తిచేయాలని తహసీల్దార్ వై. రంగారావు ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన మండలంలోని రేషన డీలర్లు, ఎండీయు వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో సుమారు 1900 కార్డుదారులు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. డీలర్లు వెంటనే ఇంటింటికి తిరిగి త్వరతగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్‌సప్లయిస్ డీటీ కిరణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉపకులాలకు ప్రయోజనం

గూడూరు: ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ ఉపకులాలకు లబ్ధి చేకూరుతుందని ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మంగళవారం గూడూరులో పర్యటించిన శ్రీదేవి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాజిక వివక్షను అరికట్టడానికే ఆనాడు రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ రిజర్వేషన్లను ప్రతిపాదించారన్నారు. ఇప్పటి ఎస్సీలలో ఒక వర్గం వారు మాత్రమే రిజర్వేషన్ల ద్వారా ఎక్కువ లబ్ధి పొందుతూ వచ్చారన్నారు. మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ల వల్ల పెద్దగా లబ్ధి చేకూరలేదన్నారు. మాదిగ ఉపకులాలకు అన్ని వర్గాలలో భవిష్యత్తులో తగిన ప్రాధాన్యం లభిస్తుందన్నారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, ఎన్‌ఏ.బేగ్, ఉడుముల నరేష్, అట్లూరి శ్రీను, ఉడుముల పుల్లయ్య, పెనుమత్స అశోక్ జయరాజు పాల్గొన్నారు.

తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలి

కార్మికశాఖ ఏసీ ఆశారాణి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్న నేపథ్యంలో నిర్మాణ రంగ కార్మికులకు సంబంధిత యజమానులు పనిసమయంలో తాగునీరు, మజ్జిగ ను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ ఆశారాణి మంగళవారం తెలిపారు. అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు కార్మికులకు విశ్రాంతి సమయం ఇవ్వాలన్నారు. ఈ నిర్ణయాలు కఠినంగా పాటించాలని నిర్మాణ రంగంలోని కాంట్రాక్టర్లు, యాజమాన్యాలకు ఆమె సూచించారు. నిబంధనలు పాటిస్తూ కార్మికుల భద్రతను పర్యవేక్షించేందుకు సహకరించాలని ఆమె కోరారు.

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

మచిలీపట్నంఅర్బన్: ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు 12వ పీఆర్సీ సాధన, పలు విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బి.లంకేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యసంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొని సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు ఈనెల బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే ఈ హుండీ కానుకల లెక్కిపులో పాల్గొనే ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో హాజరు కావాలన్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామాలయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణానికి స్థానికులు గోటి తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. భద్రాచలంలో జరిగే రాములోరి కల్యాణాన్ని ఆదర్శంగా తీసుకుని ఇక్కడ ఆలయంలో అంగరంగ వైభవంగా కల్యాణతంతు నిర్వహిస్తారు. ఈసందర్భంగా స్థానికులు గోటి తలంబ్రాలను కల్యాణానికి అందజేస్తారు. ఏప్రిల్ 6వతేదీన శ్రీరామనవమి సందర్భంగా జరిగే కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం చేసే కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు ఆసూరీ రంగానాథాచార్యులు(చిన్నారి స్వామీ) సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. వీటిని స్థానికులు గోటితో వలిచి కల్యాణం ముందురోజు ఆలయంలో అందజేస్తారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో మంగళవారం రాత్రి ఓ మహిళ మెడలో గొలుసు చోరీకి గురైంది. నోబుల్‌కాలనీకి చెందిన ఓ మహిళ ఒంటరిగా వాకింగ్ చేస్తుండటాన్ని గమనించిన గుర్తు తెలియని ఓ దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుపోయే ప్రయత్నం చేశాడు. ఆ మహిళ భయంతో కేకలు వేసి. అతని చర్యను ప్రతిఘటించటంతో దుండగుడు ఆమెపై దాడి చేసి మరీ గొలుసు తెంచుకుపోయేందుకు ప్రయత్నించాడు. దుండగుడి ప్రయత్నంలో గొలుసు సగం మాత్రమే చేతికి అందింది. అప్పటికే బాధితురాలు గట్టిగా కేకలు పెడుతుండటంతో దుండగుడు భయంతో పరారయ్యాడు. బాధితురాలు బంగారు గొలుసు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా మచిలీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రేపు సర్వసభ్య సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జె. స్వర్ణభారతి తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎంపీపీ గరుడప్రసాద్



కృత్తివెన్ను పీహెచ్‌సీలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: పేదల ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన కృత్తివెన్ను పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తీరప్రాంతమైన మండలంలో అధికంగా పేదలే ఉన్నారని అటువంటి వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి మన వంతు ప్రయత్నం చేయాలని సూచించారు. గతంలో జగనన్న ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల ఎంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. ఫీవర్ సర్వేతో పాటు ఇంటింటికీ వైద్య సిబ్బందిని పంపి షుగర్, బీపీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్య సేవలు, మందుల నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శశికుమార్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు సాయిసందీప్, వైశాలి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కూనసాని వాసు తదితరులు ఉన్నారు.

డిమాండ్ ఉన్న పంటల సాగుపై దృష్టి పెట్టాలి



ప్రకృతి సాగు పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వెంకటాపురం(మోపిదేవి): పకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆహార ధాన్యాల పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, దానికి అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల కేవీకే ఆధ్వర్యంలో ఎస్సీ దత్తత గ్రామం వెంకటాపురంలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయనాలు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటల పట్ల ప్రజల్లో కొంత విముఖత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం పార్థసారథి మాట్లాడుతూ వేసవిలో నవధ్యాన్యాల సాగు చేపట్టాలన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడారు. తొలుత వివిధ అంశాలపై రైతులతో చర్చా గోష్ఠి నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు వ్యవసాయ సాగు విధానాల స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్ తుమ్మా సోములమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, నడకుదుటి జనార్ధనరావు, ఏడీఏ జయప్రద, శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ మంజురాణి, డాక్టర్ వెంకట లక్ష్మి, డాక్టర్ నవీన్, డాక్టర్ కృష్ణవేణి, ఏవో హెప్సిబారాణి, హెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగరపాలకసంస్థ పరిధిలో ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లింపుదారులు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. మొదటి అర్ధసంవత్సరానికి జూన్ నెలాఖరులోపు, రెండో అర్ధ సంవత్సరం డిశంబర్ నెలాఖరు నాటికి పన్నులు చెల్లించని వారు 2 శాతం వడ్డీతో కలిపి పన్నులు చెల్లించాల్సివస్తుందన్నారు. అయితే పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 31వ తేదీ లోపు ఏక మొత్తంలో పన్నులు చెల్లించే వారికి 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నెల 31వ తేదీ లోగా 50 శాతం వడ్డీ రాయితీతో పన్నులు చెల్లించవచ్చన్నారు. ఇప్పటికే పన్నులు చెలించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ మొత్తాన్ని జమ చేస్తామన్నారు. వడ్డీ రాయితీని పన్ను బకాయి దారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. పన్నులను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పెడన: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించాల్సిన వారికి వడ్డీని 50 శాతం మాఫీ చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా బకాయిలు పడ్డ వారు వడ్డీ మొత్తం కాకుండా ఆ వడ్డీలో సగం కడితే సరిపోతుందన్నారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్ను బకాయిలు దారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కమిషనర్ సూచించారు.

రూ.30 వేల విలువైన మద్యం సీసాలు చోరీ



చోరి జరిగిన ప్రాంతాన్నిపరిశీలిస్తున్న ఏఎస్‌ఐ లక్ష్మణరావు

పెడన: పట్టణంలోని తోటమూల వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాపులో సోమవారం దొంగలు పడి ఐదు కేసుల మద్యం క్వార్టర్ సీసాలను ఎత్తుకుపోయారు. సేకరించిన వివరాల మేరకు మచిలీపట్నం మండలం చిట్టిపాలెంకు చెందిన కొండేటి పేరయ్యకు ఇటీవల గీత కార్మికుని కోటలో వైన్ షాపు మంజూరైంది. దీంతో ఈ నెల 12వ తేదీన తోటమూల వద్ద తాత్కాలికంగా అద్దె షెడ్డులో పీఆర్ వైన్ షాపు నామకరణం చేసి ఏర్పాటు చేశారు. దీనికి ఎదురుగా కొత్తగా నిర్మిస్తున్న వైన్‌షాపు షెడ్డు నిర్మాణం పూర్తి కావస్తున్న నేపథ్యంలో సోమవారం రాత్రి 49 కేసుల మద్యం సీసాలను నూతన షెడ్డులో దింపారు. ఉదయం మద్యం సీసాలను తీసుకువెళ్లడానికి వచ్చిన పేరయ్యకు ఐరన్ కిటికి బాగా వంచేసి ఉండటంతో పాటు మద్యం కేసులను కిటికి వద్దకు లాగి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు రూ.30 వేల విలువైన సరుకు ఉంటుందని పేరయ్య పేర్కొంటున్నాడు. అయితే రాత్రి లోడు దించిన వారే కారణం అయి ఉంటారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. అయితే పోలీసులు మాత్రం తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొవడం విశేషం.

ఆవుపాలు సరఫరాకు టెండర్ ఖరారు



టెండర్ ఖరారుదారుని ప్రకటిస్తున్న డీసీ శ్రీరామ వరప్రసాదరావు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో పూజా కార్యక్రమాలకు ఆవుపాలు సరఫరా చేసేందుకు టెండర్ ఖరారు చేసినట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం సీల్డ్ టెండర్ ఆలయ అధికారులు, భక్తులు, గ్రామస్తుల సమక్షంలో ఓపెన్ చేశారు. డీసీ శ్రీరామ వరప్రసాదరావు మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 3, 2026 సంవత్సరం కాల పరిమితికి సీల్డ్ టెండర్ ద్వారా మోపిదేవి వాస్తవ్యులు వీఎల్‌వీకే గుప్తాను లైసెన్సు దారుగా గుర్తించామన్నారు. విజయ డెయిరీకి చెందిన పాలు 200 ఎంఎల్ రూ.10.80లకు సరఫరా చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు, చెన్నకేశవ, నాగరాజు, రమేష్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు

నందివాడ: మండలం లక్ష్మీనరసినాపురంలో డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీసురక్ష హాస్పిటల్ వారిచే మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ అభిషేక్ హాజరై 200మందికి వైద్యపరీక్షలు చేశారు. గుండె, బీపీ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపి డాక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.